# భీమన్న భావ విప్లవం

నాటక కర్తగా, గేయకర్తగా, కవిగా, పీఠికా రచయితగా, పత్రికా సంపాదకుడుగా తనకంటూ ప్రత్యేకమైన విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న సాహితీవేత్త బోయి భీమన్న. ఆదికవి వాల్మీకి, ధర్మ వ్యాధుడు, వేద వ్యాసుడు, రాగవాసిష్ఠం అనే నాలుగు విశిష్ట పౌరాణిక నాటకాల్ని భీమన్న రాశారు. ఈ పౌరాణిక నాటకాల్ని ఆయన ఆధునిక దృక్పథంతో భావ విప్లవ దృష్టితో రాశారు. తమ పౌరాణిక నాటకాల ద్వారా 'హరిజనులు ఆర్యులే' అన్న విషయాన్ని భీమన్న ప్రతిపాదించారు.

'రాగవాసిష్ఠం' 1959లో వెలువడిన నాటకం. భాగవత, బ్రహ్మ వైవర్త పురాణాల్లోని అరుంధతి, వశిష్ఠులకు సంబంధించిన సంఘటనలు ఈ నాటక కథకు మూలం. అరుంధతి, వశిష్ఠుల వివాహం జరిగిన తీరు గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. తాను ప్రేమించిన అరుంధతి కులం తెలిశాక ఆమెకు దూరమవుతాడు వశిష్ఠుడు. ఆ తర్వాత విరహం భరించలేక పశ్చాత్తాపడి ఆమె దగ్గరకు వెళతాడు. అయితే ఆ లోగానే ఆమె తపస్సులో నిమగ్నమై ఉంటుంది. ఈ తపోగ్ని తాపానికి అక్కడ అంతా మండిపోయి కరువు కాటకాలు ఏర్పడతాయి. వశిష్ఠుడి తపోవనంలో కూడా తిండి నీరులేక ప్రజలు బాధపడతారు. చివరకు బ్రహ్మ దగ్గరకు వెళ్ళి తమ బాధల్ని విన్నవించుకుంటారు. బ్రహ్మ సలహా మేరకు ప్రజలు ఈశ్వరుని దగ్గరకు వెళతారు. ఆ ఈశ్వరుడే అరుంధతి ఆశ్రమానికి వస్తాడు. పశ్చాత్తాపం చెందిన వశిష్ఠుడు అప్పటికే ఆ ఆశ్రమానికి వచ్చి వుంటాడు. ప్రాచీనుడు, ఇంకా ఇతర పూర్వాచారనిష్ఠులు అరుంధతి, వశిష్ఠుల వివాహాన్ని భగ్నం చేయడానికి ప్రయత్నం చేస్తారు. శివుడు వీరికి బుద్ధిచెప్పి వారిరువురికి పెళ్ళి జరిపిస్తాడు. ఇది పౌరాణిక ఇతివృత్తం అయినా ఇందలి సన్నివేశాల్ని, సంఘటనల్ని ఆధునిక దృష్టితో సాంఘిక నాటకరీతిలో భీమన్న తీర్చిదిద్దారు.

ఉత్తర రామాయణంలోని వాల్మీకి చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని 1970లో 'ఆదికవి వాల్మీకి' నాటకాన్ని భీమన్న రాశారు. మూలానికి భిన్నంగా కొన్ని మార్పులు చేసి అద్భుతమైన నాటకాన్ని సృష్టించారు. నాటక ఇతివృత్తం పౌరాణికమైనా, సాంఘిక నాటకంగా భాసిస్తుంది. దీనికి ప్రధాన కారణం సంఘపరమైన చర్చ ఎక్కువగా వుండి అది హేతువాద దృక్పథంతో సాగడం. కులగిరి, రామపాదం, శివోహం, మకరంద మొదలైన పాత్రలు కేవలం కల్పితం. కులపరమైన సంకుచిత స్వభావంతో కనేడు గట్టిన రాయి అనే అర్థాన్ని కులగిరి పేరు చూపిస్తుంది. కులపరంగా ఏ వ్యక్తీ గొప్పవాడు కాదని కుల వ్యవస్థే కృతకం అని భావించారు భీమన్న. హరిజనులు ఆర్యులనే విషయాన్ని చెప్పడానికి ప్రయత్నించే భీమన్న 'ఆదికవి వాల్మీకి' అనే నాటకంలోనూ అదే విషయాన్ని రుజువు చేయడం కోసం ప్రయత్నించారు.



బోయి భీమన్న

భారత అరణ్య పర్వ పంచమాశ్వాసంలోని 27 నుంచి 145 వరకు గల పద్యాల్లో విస్తరించిన ధర్మవ్యాధుడి కథ 'ధర్మవ్యాధుడు' నాటక ఇతివృత్తానికి మూలం. ఈ కథను తమ భావాలకు అనుగుణంగా, భావంలోనూ, భాషలోనూ, ఆధునికతను కనపరుస్తూ 1970లో నాటకాన్ని రాశారు భీమన్న. భారతానికి సంబంధించిన ఇతివృత్తాన్ని తీసుకొని నాటక రచన చేసినా నేటి సమాజంలోని అనేక రుగ్మతల్ని, అహేతుక సంప్రదాయాల్ని నిశితంగా విమర్శిస్తూ పురాణ కథను తమ ప్రతిభా పాటవాలతో ఆధునికం చేశారు భీమన్న.

ఆంధ్ర మహాభారతంలోని ఆదిపర్వం 387 నుంచి 420 వరకు గల పద్యాల్లో విస్తరించిన చిన్న కథే ఈ నాటకం. ఇంకా ఆయా తావుల్లో కన్పించే వ్యాసునికి సంబంధించిన కొన్ని ఘట్టాలు ఈ నాటక రచనకు మూలం. సత్యవతి పరాశరుణ్ణి నదిని దాటిస్తున్న సమయంలో చుక్కాని జారి నదిలో పడుతుంది. చుక్కాని కోసం సత్యవతి నదిలో దూకుతుంది. ఆమెకు అపాయం జరుగుతుందేమోనని పరాశరుడు నదిలోకి దూకి ఆమెను పడవలోకి ఎక్కిస్తాడు. ఈ సన్నివేశాన్ని మూలానికి భిన్నంగా భీమన్న కల్పించారు. వారిద్దరు ఒకరినొకరు ప్రేమించుకోవడానికి ఈ కల్పన అద్భుతంగాఉంది.

భీమన్న మొదటినుంచి వ్యక్తిగా, సాహిత్యకర్తగా బానిసత్వాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. పాలేరు మొదలైన వీరి సాంఘికనాటకాల్లో ఈ దృక్పథం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ఈ సందర్భంగా వ్యాసుడిచేత కూడా ఇదే దృక్పథాన్ని వ్యక్తీకరింపచేయడం వారి ఆత్మీయతకు నిదర్శనం. వ్యాసుడి వంశక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని అతని చేత అభ్యుదయ భావాల్ని వెల్లడించడం ద్వారా భావ విప్లవాన్ని సృష్టించారు భీమన్న.

– వెలమల సిమ్మన్న

తెలుగు ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం